



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

19వ వసంతంలోకి ...

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

బుధవారం 22 అక్టోబర్ 2025 పేజీలు 10







## ఘనంగా దీపావళి పండుగ వేడుకలు

















### బ్రాహ్మణపల్లి హనుమాన్ దేవాలయ భూమిని పరిరక్షించాలి

- సర్వే నెంబర్ 215లో 6ఎకరాల 18 గుంటల హనుమాన్ దేవాలయ భూమి అన్యాక్రాంతం కాకుండ పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన భూమిని అక్రమార్కులు కాజేయాలని చూస్తున్నారు
- నిషేధిత జాబితాలో ఉన్న భూమిని శ్రీనివాసశర్మ అనే వ్యక్తి అక్రమంగా పట్టామార్పిడి చేసుకున్నారు

మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 21): మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 215లో ఉన్న 6ఎకరాల 18 గుంటల హనుమాన్ దేవాలయ భూమిని అన్యాక్రాంతం కాకుండ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు

6లో




# చీకటిపై వెలుగు విజయమే దీపావళి పండుగ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల మేజర్ న్యూస్ : చీకటిపై వెలుగు విజయమే దీపావళి పండుగ అని,దుష్టశక్తుల్ని పారద్రోలి కొత్త జీవితానికి స్వాగతం పలికే వెలుగుల రోజు దీపావళి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ప్రజలందరికీ దీపాలు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను తన నివాసం వద్ద నియోజకవర్గం ప్రజలు, పార్టీ శ్రేణులు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాలలో కొత్త వెలుగు నింపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## మట్టి దీపాలతో దీపావళి వేడుకలు - ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 21): ప్రకృతికి, సమాజానికి హాని కలిగించకుండా ఉండాలంటే దీపావళి పండగ వేడుకలను మట్టి దీపాల కాంతులతోనే జరుపుకోవాలని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె సూచించారు. దీపావళి పండగను పురస్కరించుకుని షాద్‌నగర్ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పిజి కళాశాలలోని తెలుగు డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండగ విశిష్టత వంటి పలు అంశాలపై విద్యార్థినులు తమ ఉపన్యాసాలతో అంద రనీ ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె మాట్లాడుతూ విద్యార్థినులకు పండగ జరుపుకోవడానికి గల కారణాలు, వృతాంతము, చరిత్ర వంటి అంశాలను వివరించారు. మనం సంతోషంగా చేసుకునే పండుగలు ప్రకృతికి గాని, మానవాళికి గాని హాని కలిగించేవిగా ఉండకూడదని, అందుకే దీపావళి పండగలో మట్టి దీపాలను వాడాలన్నారు. మట్టి దీపాల వెలుగులోనే ప్రతి ఒక్కరు దీపావళి వంటి పండుగలు జరుపుకుంటే కాలుష్యం నివారించిన వారవుతామన్నారు. కళాశాలలోని తెలుగు డిపార్ట్‌మెంట్ ఉపాద్యాయురాళ్లు డాక్టర్ రమణమ్మ, రాజేశ్వరి, పావని దీపావళి వేడుకలు విద్యార్థినులతో కలసి చక్కగా నిర్వహించారన్నారు. విద్యార్థినులకు పండగల విశిష్టతతో పాటు తమ కర్తవ్యాన్ని తెలియజేస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినందుకు వారిని ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

కొందుర్గు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 21): గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు స్థానిక ఎస్సై ఎల్ రవీందర్ నాయక్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు... మండల కేంద్రానికి చెందిన నస్కంటి శ్రీశైలం (38), అతని తమ్ముడు నస్కంటి చిన్నయ్య (35)లు సోమవారం రాత్రి 7.40 నిల సమయంలో లూనాపై మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి వస్తూ, యూనియన్ బ్యాంకు సమీపంలో మళ్ళుతుండగా, షాద్‌నగర్ నుంచి గుర్తు తెలియని మోటర్ సైకిల్ అతివేగంగా వచ్చి లూనాను ఢీ కొంది. లూనాను ఢీ కొనడంతో, నస్కంటి శ్రీశైలంకు నడుముపై గాయం అయ్యింది. అలాగే నస్కంటి చిన్నయ్య ఎడమ కాలుకు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు. నస్కంటి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు మంగళవారం నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల కోసం వెళ్లిన మహిళ అదృశ్యం...

మండల కేంద్రంలో కూరగాయల కోసం ఇంటి నుంచి వెళ్లిన వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై ఎల్ రవీందర్ నాయక్ కథనం మేరకు... మండల కేంద్రానికి చెందిన జిట్టి చెన్నప్ప, భారతమ్మల కూతురు బంటు సరిత(35)ను గత 15 సంవత్సరాల క్రితం వికారాబాద్ జిల్లా లోని ధారూర్ మండల పరిధిలోని చిన్నమోముల గ్రామానికి చెందిన బంటు ఆనంద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. గత మూడు సంవత్సరాల క్రితం బంటు ఆనంద్, బంటు సరితలు కొందుర్గుకు వచ్చి ఉంటున్నారు. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సరిత మండల కేంద్రంలోని కూరగాయాల మార్కెట్‌లో కూరగాయలు తీసుకవస్తానని ఇంటి నుంచి బయలుదేరింది. కూరగాయల కోసం వెళ్లిన సరిత రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో, చుట్టూ పక్కల తెలిసిన వారి ఇండ్లల్లో వెతికారు. మరుసటి రోజు నుంచి బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకి లభించలేదని ఎస్సై వివరించారు. సరిత తల్లి జిట్టి భారతమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీ కొని తండ్రి, కొడుకుకు గాయాలు...

మండల కేంద్రంలో సోమవారం రాత్రి కారు ఢీ కోనడంతో తండ్రి, కొడుకుకు గాయాలైనట్లు స్థానిక ఎస్సై ఎల్ రవీందర్ నాయక్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు...రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రజాపత్ ప్రభురాం (44) గత 22 సంవత్సరాల క్రితం కొందుర్గుకు వచ్చి వ్యాపారం చేసుకుంటున్నాడు. దీపావళీ పండుగ సందర్భంగా ప్రభురాం, అతని కూమారుడు హిమాన్షు (12) సోమవారం రాత్రి సుమారు 10.50 నిలకు తన బంధువుల ఇంటికి స్కూటిపై బయలుదేరారు. ఇదే సమయంలో కొందుర్గు నుంచి షాద్‌నగర్ వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి, స్కూటిని ఢీ కొట్టింది. దీంతో స్కూటిపై ఉన్న ప్రభురాం కాలుకు గాయం కాగా, హిమాన్షు తలకు తీవ్ర గాయం అయ్యింది. చికిత్స నిమిత్తం హిమాన్షును హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాదితుడు ప్రభురాం ఫిర్యాదు మంగళవారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దీపావళి సందర్భంగా వరుణ్ డెవలపర్స్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు

▶▶ పాల్గొన్న ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కొలిశెట్టి సంజయ్‌కుమార్

▶▶ శాలువాలతో సత్కరించిన సిఎండి డా. రమేష్ నాయుడు







వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃదీపావళి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని వరుణ్ డెవలపర్స్ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వనస్థలిపురంలోని కార్యాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో సిఎండి డా. రమేష్ నాయుడు ఆహ్వానం మేరకు పిసిసి మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, స్పూర్తి సేవా సమితి అధ్యక్షుడు కొలిశెట్టి సంజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సంజయ్‌కుమార్ ల ను సత్కరించిన సిఎండి రమేష్ నాయుడు వారి చేతుల మీదుగా మార్కెటింగ్ డైరెక్టర్లు, సిబ్బందికి దీపావళి కానుకలను అందజే శారు. అనంతరం వారు మాట్లాడుతూ నమ్మకంతో కూడిన వ్యాపారం సాగిస్తు సంస్థలో పని చేసే సిబ్బందిని కుటుంబ సభ్యులుగా చూసుకుంటు పండుగ సందర్భంగా వారికి కానుకలు అందజేయడం హర్షణీయమన్నారు. వ్యాపార రంగంలో మంచి సేవలు అందిస్తు అవార్డులు అందుకున్న వరుణ్ డెవలపర్స్ సిఎండి డా. రమేష్ నాయుడు పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కళను నెరవేర్చేందుకు ముందుకు సాగడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సుమలత, వరుణ్‌నాయుడు, మార్కెటింగ్ డైరెక్టర్స్ సంధ్య, వెంకటేష్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అందెల ఆగమయ్య మృత దేహానికి ఘన నివాళులు

### "ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు హాజరు"





బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21): అందెల శ్రీరాములు తండ్రి అందెల ఆగమయ్య మృతి దేవానికి ఘన నివాళులర్పించిన పలువురు బిజెపి నేతలు. రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు తండ్రి అందెల ఆగమయ్య పరమ పదించారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మాజీ రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు తదితరులు హాజరై పుష్పగుచ్ఛాలు ఉంచి, ఆగమయ్య భౌతికకాయానికి ఘన నివాళులు అర్పించారు. వారు శ్రీరాములు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, బంధు మిత్రులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అఖిల భారత విశ్వకర్మ మహాసభ కాప్రా మండల్ నూతన కమిటి ఎన్నిక

### నియామక పత్రాలు అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు కౌలె జగన్నాదం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఅఖిల భారత విశ్వకర్మ మహాసభ కాప్రా మండల నూత న కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాదం నియామక పత్రాలు అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా గురుమంచి వేణుగోపాల్‌చారి, మహిళా అధ్యక్షురాలుగా పబ్బోజు శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా కానోజు రాధికా, కోశాధికారిగా ఉప్రోజు చందన, ఉపాధ్యక్షురాలుగా జెక్కోజు కళావతి, ఉపాధ్యక్షులు పాములపర్తి దశరథచారిలు నియమితులయ్యారు. నూతనంగా నియమితులయిన కమిటి సభ్యులు విశ్వకర్మల అభ్యున్నతి, సంక్షేమం కోసం ముందుకు సాగాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి విశ్వకర్మకు అందే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా జగన్నాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉప్రోజు వరలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గురుమంచి వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## జన హృదయ నేత ఎమ్మెల్యే వివేకానంద : శ్రీనివాస్ రెడ్డి

దుండిగల్ మేజర్ న్యూస్ : జన హృదయ నేత, నేత ఎమ్మెల్యే వివేకానంద జన్మదిన వేడుకలు మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు మధ్య కోలాహలంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తల, అభిమానుల, శ్రేయోభిలాషులు అభినందలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి బర్తుడే విషెస్ తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్వగృహం వద్ద సందడి నెలకొన్నది. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద పుట్టినరోజు సందర్భంగా వారి నివాసం వద్ద వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డికి మాట్లాడుతూ నిరుపేదలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నేనున్నానంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల మన్ననలు చూరగొంటున్న నాయకుడు ఎమ్మెల్యే వివేకనందని తెలిపారు.

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం...

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
● పోలీసు అమరవీరులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి ● జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ● పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్...

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :** పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం అని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించే పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యం లో మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల బలిదానం దేశానికి గర్వకారణమని కొనియా డారు. పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని సమాజంలో భద్రత, శాంతిని కాపాడటంలో పోలీసులు నిరంతరం పోరాడుతు న్నారని ఆయన అన్నారు. దేశ సరిహద్దుల్లో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది వీరుల స్మారకార్థం ఈ రోజును జరుపుకోవడం మనందరి బాధ్యత అని వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎం తో ఆదర్శమన్నారు. జిల్లా పరిపాలనలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని, జిల్లా ప్రజల తరఫున అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... దేశ అంతర్గత భద్రతను కాపాడుతూ, చట్టాన్ని అమలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వీర పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశంగా భావించాలన్నారు.



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్..

శాంతిభద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. వారి నిస్వార్థ సేవ మరియు త్యాగాలు జిల్లా పోలీసులకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి సంధార్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు మొదలగు వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పోలీస్ పరేడ్ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, అదనపు ఎస్పి బి.రాములు నాయక్ జిల్లాలోని పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల గౌరవ వందనం మధ్య జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్,పరిగి, తాండూరు డిఎస్పిలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, బాల కృష్ణ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్పి జానయ్య , డిటిసి డిఎస్పి శ్రీనివాసులు,ఆర్ డిఎస్పి వీరేష్,సీఐలు భీమ్ కుమార్,శ్రీధర్ రెడ్డి,రఘు రాములు, శ్రీనివాస్ రెడ్డి,వెంకట్,సంతోష్ కుమార్, నాగేష్, ఇన్స్పెక్టర్‌లు, ఆర్ఐలు,ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పి నారాయణరెడ్డి...



పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద నివాళు లర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు..



పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు

# 97 ఏళ్ల వృద్ధుడికి విజయవంతమైన శస్త్రచికిత్స

● మెడిసిటీ వైద్యుల ప్రతిభకు రోగి ప్రాణం దక్కింది

**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21):**

మేడ్చల్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు అరుదైన వైద్య విజయాన్ని నమోదు చేశారు. వయసు 97 సంవత్సరాలున్న ఒక వృద్ధుడికి మూత్ర సంబంధిత సమస్యపై విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నాడు.

అజీజ్ అనే వృద్ధుడు గత కొంతకాలంగా మూత్ర విసర్జనలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అనేక ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరికి మెడిసిటీ హాస్పిటల్ వైద్యులను సంప్రదించాడు. అక్కడి వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి మూత్రాశయం నుండి మూత్రం బయటకు వెళ్లే ద్వారంలో అడ్డంకులు ఏర్పడినట్లు గుర్తించారు.

దీంతో వైద్య బృందం ట్రాన్స్ యురేత్రల్ రీసెక్షన్ అనే ప్రత్యేక శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. డాక్టర్ నితీష్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, నేతృత్వంలోని బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.

శస్త్రచికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకొని, ప్రస్తుతం మూత్ర విసర్జనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్నాడని వైద్యులు తెలిపారు. డాక్టర్ నితీష్ మాట్లాడుతూ,.. "97 ఏళ్ల వయసులో రోగిపై ఆపరేషన్ చేయడం చాలా సవాలుతో కూడుకున్నది. అయితే రోగి ధైర్యం, వైద్య బృందం నైపుణ్యం కలిసివచ్చి ఈ విజయాన్ని సాధించాం. ఇప్పుడు ఆయన



పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు," అన్నారు.

ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ (ప్రెసిడెంట్), శ్రీ ఐనీస్ మర్చంట్ (సీఈవో), డాక్టర్ గీత (మెడికల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్), డాక్టర్ సల్మాన్ సాదిక్ (యూనిట్ హెడ్)తో పాటు మెడిసిటీ వైద్య బృందం సమిష్టిగా కృషి చేసింది. వారి సమన్వయంతో ఈ అరుదైన వైద్య విజయం సాధ్యమైందని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.

## దీపావళి సందర్భంగా పేదలకు అండగా నిలిచిన అబ్బవతి నర్సింహా



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :** ప్రతి ఇంటిలో వెలుగు నింపే దీపావళి పండుగ సందర్భంగా నిరుపేదలకు అండగా నిలవడం ఆనందంగా ఉందని పోచారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్బవతి నర్సింహా తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లి దివ్యానగర్ రోడ్డులోని తన వ్యక్తిగత కార్యాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం సుమారు 25 మంది నిరుపేద వృద్ధులకు నూతన వస్త్రాలు, నెల ఇంటి సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ... దీపావళి పండుగ అంటే కుటుంబాల్లో వెలుగులు నింపే పర్వదినం. అలాంటి వేళ పేదల కళ్లలో ఆనందం నింపడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, నర్సింహా రెడ్డి, అవినాష్, ఎల్లేష్, జై నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేటలో ఉమేష్ చంద్ర ఐపీఎస్‌కు ఘన నివాళులు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్మరణ కార్యక్రమం



**శామీర్ పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21) :**

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం శామీర్ పేట మండలంలోని తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో పోలీసు అమరవీరుడు ఉమేష్ చంద్ర ఐపీఎస్‌కు ఘన నివాళులు అర్పించారు. మహమ్మద్ అఫ్జల్ ఖాన్ విద్యార్థులతో కలిసి ఉమేష్ చంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం గంభీర వాతావరణంలో జరిగింది.అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ,.. సమా జంలో శాంతి భద్రతలను కాపాడేందుకు, ప్రజల ప్రాణాలను రక్షించేందుకు పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి సేవలకు గౌరవం తెలుపారు.

## మానసిక వికలాంగుడైన బాలుడు అదృశ్యం

శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

**శామీర్ పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21):**మానసిక వికలాంగుడైన ఒక బాలుడు అదృశ్యమైన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శశివర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం, మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్ గూడలో ఉన్న క్రిస్టియన్ ఆశ్రమంలో నివసిస్తున్న మతిస్థిమితం లేని ఆకాష్ (14) అనే బాలుడు ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయంపై ఆశ్రమ సూపర్వైజర్ రాజన్ బెహరా సోమవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన బాలుడు మానసిక వికలాంగుడని, సరైన రీతిలో మాట్లాడలేడని, కనిపించకుండా పోయిన రోజున క్రీమ్ రంగు చొక్కా, నీలి రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శశివర్ధన్ తెలిపారు.



# ఉమ్మడిగా ఆలోచించి ఉద్యమించాలి : గోవర్ధన్ రెడ్డి



యాచారం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21): బీసీలు ఒక తాటిపై వచ్చి సమాలోచనలు చేసుకొని 42 శాతం రిజర్వేషన్ పై ఉద్యమించాలని మండల కేంద్రంలోని నందివనపర్తి గ్రామ మాజీ ఉపసర్పంచ్ మూడేడ్ల గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మేజర్ న్యూస్ తో మాట్లాడిన గోవర్ధన్ రెడ్డి... బీ సీ లు తమ ఐక్యమత్యాన్ని చాటు కోవాల్సిన సమయం వచ్చిందని, ఉమ్మడిగా ఉద్యమించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు బీ సీ ల రిజర్వేషన్ పై రాజకీయం మానుకోవాలని, రిజర్వేషన్ అమలు అయ్యే ప్రతి పాదనలు కోర్టులకు సమర్పించి బీసీలకు న్యాయం చేయాలాన్నారు. పెరుగుతున్న జనాభా ఆధారంగా తమ రిజర్వేషన్ పెరగాలి అనుకుంటున్న బీసీల నాణ్యమైన వైఖరి ని అందరు ఒప్పుకోవాలని, కులాలకు, రాజకీయాలకు అతీతంగా బీ సీ లకు సహకరించాలని అన్నారు. బీ సీ ల భవిష్యత్ తరాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పేర్కొన్నారు.

# జేబులు నింపితే చాలు బిజెఎంసిలో టపాసుల దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చు

- కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా టపాసుల దుకాణాలను నిర్వహిస్తున్న వైనం
- నిబంధనలు పాటించవలసిన అవసరం లేదుప్రమాదాలు జరిగితే జరగని తమకేంటి అని వదిలేస్తున్న యంత్రాంగం
- మచ్చుక కూడా కనిపించని డీసీపీ సిలిండర్లు



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విచ్చలవిడిగా టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు.అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదాలు జరగకపోయినప్పటికీ ఒకవేళ ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏంటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు? గతంలో కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీ ప్రధాన కూడలిలో ఒక ప్రబుద్ధుడు ఫుట్ పాత్ పై టపాసుల దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. ఆ దుకాణానికి ఎవరిని కాపలా ఉంచకపోవడంతో ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా వచ్చి టపాసులు దుకాణాన్ని కాల్చి వేయడంతో. ఒక్కసారిగా అగ్నిజ్వాలలు ఎగిసిపడి దానికి పక్కనే ఉన్న టెంట్ హౌస్ ,మెడికల్ షాప్ ,హోటల్ అగ్నికి దగ్ధమయ్యాయి. సుమారుగా కోటి రూపాయల నష్టం వాటిల్లింది.ఇంత పెద్ద ఘటన జరిగిన తర్వాత కూడా బి జె ఎం సి అధికారులు టపాసుల దుకాణాలకు అనుమతులు ఇచ్చే సమయాలో. నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకునేవారికి అనుమతులు ఇవ్వవలసి ఉండగా. అలాంటివి ఏమి పట్టించుకోకుండా ఎవరైతే అడిగినంత కాసులు ముట్ట చెబుతున్నారో వారికి అనుమతులు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. టపాసులు దుకాణం అంటేనే చాలా జాగ్రత్తగా నిర్వహించే వ్యాపారం. టపాసుల దుకాణం ఏర్పాటు చేయాలంటే ఈ నిబంధనలను పాటించాలి: -1.అగ్నిమాపక శాఖ, పోలీసులు, మున్సిపల్ శాఖల అనుమతులు తప్పనిసరి. 2.నివాస ప్రాంతాలకు దూరంగా అధికారులు సూచించిన ప్రాంతంలోనే టపాసుల దుకాణాలను ఏర్పాటు చేయాలి3. మంటలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి కలప ,టార్పాలిన్, వస్త్రం లాంటివి దుకాణాల్లో ఉండకూడదు. 4. దుకాణాలో ఎలక్ట్రికల్ వైర్లు అతుకులు లేకుండా లైసెన్స్ ఎలక్ట్రిషన్ తో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసుకోవాలి 5. ప్రతి దుకాణాల్లో విధిగా ఐదు కిలోల చొప్పున రెండు డ్రై కెమికల్ పౌడర్ (డీసీపీ) సిలిండర్లు ఉండాలి. 200 లీటర్ల సామర్థ్యం గల నీటి తో డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవాలి. ఇసుక నింపిన 6 బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.6. ఒక్కో దుకానికి సుమారుగా మూడు మీటర్ల దూరాన్ని పాటించాలి.ఈ నిబంధనలు పాటిస్తున్న దుకాణాలు మచ్చుక కైనా కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు నానా హడావిడి చేసే యంత్రాంగం. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని కొన్ని చోట్లలో ఫంక్షన్ హాల్ గోదాములలో భారీ మొత్తంలో టపాసులు డంపు చేస్తున్నారు.టపాసులు డంపు చేయడం వలన పలు ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఇవేమి తెలియనట్టుగా తమకు ముడుపులు అందిస్తే చాలు ఎవరికి ఏమైతే తమకేంటి అనే విధంగా కార్పొరేషన్ అధికారులు పోలీసులు అగ్గి మాపక శాఖ అధికారులు వ్యవహరించడం సరైనది కాదని సూచిస్తున్నారు. టపాసుల దుకాణ యజమానులు ఒక్కో శాఖకు అనుమతులతో పాటు వారికి ఇవ్వవలసిన డబ్బులు ముట్ట చెప్పి. వారు అడిగినన్ని టపాసులను కూడా ఇవ్వాలి లేని పక్షంలో వారిపై కక్ష సాధించి జరిమానాలను విధిస్తున్నారని దుకాణ యజమానులు తెలుపుతున్నారు.ఇప్పటికైనా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేటప్పుడు అధికారులు నియమ నిబంధనలు పాటించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



మాడ్గుల, మేజర్న్యూస్ (అక్టోబర్ 21): మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ కిసాన్సెల్ మాజీ అధ్యక్షులు దండు శేఖర్గౌడ్ గతకొంత కాలంగా అనారోగ్యంతో బాదపడుతూ హైద్రాబాద్ ఎమ్ఎన్జె క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం ఎమ్ఎన్జె ఆసుపత్రికి చేరుకొని శేఖర్గౌడ్ను పరామర్శించి ఆరోగ్యపరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నట్లు యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు కల్లు తిరుపతిరెడ్డి తెలిపారు. అనంతరం శేఖర్గౌడ్ కుమారుడు మహేష్గౌడ్, కుటుంబీకులకు భరోసానిచ్చి వైద్య ఖర్చుల నిమిత్తం 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు తిరుపతిరెడ్డి వివరించారు. అదే విధంగా ఎమ్ఎన్జె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కిసాన్సెల్ మాజీ అధ్యక్షులు దండు శేఖర్గౌడ్ను ఆర్కపల్లి మాజీ సర్పంచ్లు ఏర్పుల జంగయ్య, దండు వెంకటయ్యగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరుసవాడ శ్రీనివాస్ప్రజాపతి, తెలంగాణ కుమ్మరసంఘం రాష్ట్ర నాయకులు సిరుసవాడ చంద్రశేఖర్ ప్రజాపతి, ఆర్కపల్లి కాశీవిశ్వేశ్వర వీరాంజనేయస్వామి ఆలయకమిటి సభ్యులు దండు శ్రీనివాస్గౌడ్, ఆకుతోట జగన్మోహన్గుప్త, దండు తిరుపతయ్యగౌడ్, ఆకుతోట జంగయ్యగుప్త, మండలంలోని వివిధ పార్టీల నాయకులు ఆసుపత్రికి చేరుకొని శేఖర్గౌడ్ను పరామర్శించి ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకుంటున్నట్లు శేఖర్గౌడ్ కుటుంబీకులు వివరించారు.

# దేశభక్తి భావాలను పెంపొందించడంలో యువత ముందుండాలి

- కడ్తాల్లో పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా యువతకు వాలీబాల్ పోటీలు
- ముఖ్య అతిధులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసిన సి.ఐ గంగాధర్, మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహ్మారెడ్డిలు



కడ్తాల్, మేజర్న్యూస్ (అక్టోబర్ 21): దేశభక్తి భావాలను పెంపొందించడంలో యువత, విద్యావంతులు ముందుండాలని కడ్తాల్ సి.ఐ గంగాధర్, మాజీ సర్పంచ్, సర్పంచ్ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మినర్సింహ్మారెడ్డి కోరారు. పాశ్చాత్య పోకడలు మితిమీరుతున్న వర్తమాన సమాజంలో యువత డ్రగ్స్, మత్తుపదార్థాలకు బానిస కాకుండ జీవితానికి ఉన్నత లక్ష్యాన్ని నిర్ధేశించుకొని లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని వారు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడ్తాల్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గడిచిన రెండురోజులుగా నిర్వహించిన ఈ పోటీలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 వాలీబాల్ జటు పాల్గొనగా చివరిరోజు హోరాహోరీగా సాగిన పోటీలలో మొదటి బహుమతి కడ్తాల్ పట్టణ జట్టు , ద్వితీయబహుమతిని సాలార్పూర్ గ్రామ వాలీబాల్ జట్టు, తృతీయ బహుమతిని రావిచెడు గ్రామ జట్టు కైవసం చేసుకున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సి.ఐ గంగాధర్, మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహ్మారెడ్డి, ఎస్.ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఈటీ భీముడు, ఫార్చ్యూన్ బటర్ప్లై సిటీ యజమాని లక్ష్మణస్వామి,పోలీస్ సిబ్బందితో కలిసి వారు విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సి.ఐ గంగాధర్, మాజీ సర్పంచ్ ఎల్.ఎన్.రెడ్డిలు మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా ఆటలు ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని సూచించారు. అలాగే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆటలతో పాటు పాఠశాల విద్యలోను ప్రతిభ చూపించాలని సూచించారు. అదేవిధంగా కార్యక్రమ ఆరంభంలో పోలీస్ అమరవీరుల స్మారకార్థం రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్గౌడ్, మహేష్, వివిధ గ్రామాల వాలీబాల్ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# మెడిసిన్ విద్యార్థినికి సన్మానం



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) ఇటీవల ప్రకటించిన మెడిసిన్ ఫలితాలలో సీటు సాధించిన ఆమనగల్లు పట్టణానికి చెందిన సాయి దీపికను మంగళవారం నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సన్మానించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి మహబూబ్నగర్ మెడికల్ కళాశాలలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. కుల వృత్తిపై ఆధారపడిన తల్లిదండ్రులు యాదయ్య,సుజాత లకు ఇద్దరు కుమార్తె లు ఒక బాబు ఉన్నారు. అందులో పెద్ద కుమార్తె సాయి నందిని గతంలో మెడికల్ సీట్ సాధించగా ప్రస్తుతం రెండవ కూతురు సాయి దీపిక మెడిసిన్ సీట్ సాధించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివించడం ఆదర్శ ప్రాయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కానుగుల దశరథం, గణేష్, బాలు, నాగేష్, కోటి పాల్గొన్నారు.

# మర్రి బాల్ రెడ్డి మృత దేహానికి నివాళి

**"ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ భుజంగ రెడ్డికి పితృవియోగం పట్ల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సానుభూతి"**





బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్కు చెందిన ఏబీఎన్%-%ఆంధ్రజ్యోతి సీనియర్ న్యూస్ రిపోర్టర్ మర్రి భుజంగ రెడ్డి తండ్రి స్వర్గీయ బాల్ రెడ్డి మృతిచెందారు. ఈ విషయం తెలిసి, మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భుజంగ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మరణించిన బాల్ రెడ్డి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి దుఃఖంలో తాను భాగమని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, మీడియా ప్రతినిధులు, బంధుమిత్రులు నివాళి అర్పించారు.

## ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మాజీ వైస్ ఎంపీపీ



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21 )కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని మంగళవారం ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం తన సోదరుని కుమారుని వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రాన్ని అందించి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం...

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకునే వారు కరువు
- నాయకుల కనుసైగల్లో కొనసాగుతున్న రవాణా...


రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న ఫిల్టర్ ఇసుక


అక్రమంగా వేసుకున్న విద్యుత్ వైర్లు

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)**
కుల్కచర్ల మండలంలో జోరుగా చీకటి వ్యాపారాలు కొనసాగడానికి అధికారులకు, బడా నాయకులకు అక్రమార్కులకు మధ్య శృతిమించిన స్నేహం వారధిగా నిలిచింది. అక్రమంగా సాగే రహస్య రవాణాకు చీకట్లో ఒప్పందాలు కుదుర్చుకొని, నీకు నేను తోడు, నాకు నీవు తోడు అన్న చందంగా మా రింది అధికారుల వ్యవహార శైలి దాంతో కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి, రాంపూ ర్, బొమ్మిరెడ్డిపల్లి, అనంతసాగర్, కుసుమ సముద్రం, చాపలగూడెం, గ్రామాలలో ఇబ్బడి ముబ్బడిగా మట్టిని తవ్వి కడిగిన మట్టిలోంచి ఇసుకను తీస్తున్నారు. తీసిన ఇసుకను దర్జాగా ఇండ్ల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను సరఫరా చేస్తున్నారు. గ్రామాలలో మట్టి నుండి ఉత్పత్తి అయ్యే ఇసుకను తయారు చేసే క్రమంలో రెవెన్యూ అధికారులకు సమాచారం తెలిసిన తెలియనట్లు ఉండడంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రకృతి సహజమైన మట్టిని తవ్వి ఇసుకను తయారు చేస్తున్న సమాచారాన్ని పలుమార్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బొమ్మిరెడ్డిపల్లి, ఇప్పాయిపల్లి, రాంపూర్, అనంతసాగర్ గ్రామాల ప్రజల ఆరోపిస్తున్నారు. అయ గ్రామాలలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు, సాగునీటి తరలింపు అక్రమాలపై గతంలో అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన ఫలితం లేదని ఆ గ్రామస్తులు పలువురు ఆరోపించడం జరిగింది. కుల్కచర్ల మండల కేంద్రానికి ప్రతి రోజు 10 నుండి 20, ట్రాక్టర్లు ఫిల్టర్ ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ, విధి నిర్వహణలో అధికారులు గాని, రెవెన్యూ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో సాగుతున్న అక్రమ రవాణాకు, అధికారులకు, అక్రమార్కులకు మధ్య కుదిరిన చీకటి ఒప్పందమే. అశ్రద్ధకు కారణమని ప్రజల అభిప్రాయం. మండల కేంద్రంలో అధిక సంఖ్యలో


అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణ

గృహ నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో ప్రతిరోజు బొమ్మిరెడ్డి పల్లి, ఇప్పాయిపల్లి, చాపల గూడెం, రాంపూర్, గ్రామాల నుండి రాత్రి వేళల్లో పెద్ద మొత్తంలో ఇసుక రవాణా కొనసాగుతుందని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రంలో రాత్రి సమయాన పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల రవాణా జరుగుతున్న పట్టించుకోకపోవడానికి కారణాలు అర్థం చేసుకోవచ్చని స్థానిక ప్రజానికం తీవ్రంగా ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వనరులను కాపాడాలని కోరుకుంటున్నారు.

## మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్
# గురుకులాలను తరలించొద్దు

### జేఏసీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన


నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 21):**
మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ లక్ష్మినారాయణగుప్త, కో కన్వీనర్‌లు జీ.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు అన్నారు. విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందన్నారు. మంగళవారం స్థానిక వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకొని ర్యాలీతో నిరసన తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో ఉండటంతో అన్నీ విధాలుగా అభివృద్ధి జరుగుతుందని భావించిన ప్రజలు విద్యాసంస్థల తరలింపుతో నిరాశకు గురవుతున్నారన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. విద్యాసంస్థల తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో నవాజ్, ఎస్ఎం.గౌసన్, పవన్, రమేశ్‌బాబు, ఎన్.రాజేందర్, భీమరాజ్, సూర్యానాయక్, సి.శ్రీనివాస్, పకీరప్ప, శివ కుమార్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

# అనంత రిసార్ట్స్ ఇల్లీగల్

- గొట్టిముక్ల గ్రామ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న అనంత రీసార్ట్
- డిటిసిపి నుండి అనుమతులు తీసుకోని వైనం
- ఇల్లీగల్ రీసార్ట్‌కు ఓ అధికారి అండ ఉన్నట్లు ఆరోపణలు..!
- అధికారి నిర్లక్ష్యం కారణంగా గ్రామ ఆదాయానికి గండి
- డిపిఓ స్పందించాలంటున్న గొట్టిముక్ల గ్రామస్తులు


అనంత రీసార్ట్‌లో లగ్జరీ రూమ్‌లు

**వికారాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)ః**
వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో నిధులు లేక ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. రెండు సంవత్సరాలుగా పాలకవర్గం లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈ కష్టకాలంలో ఏదైన గ్రామాలలో వెంచర్లు, ఫామ్‌హౌజ్ లు, రీసార్ట్‌ల నిర్మాణాలు చేస్తే ఆ గ్రామాలకు కాస్త ఆదాయం సమకూరుతుంది. వచ్చిన ఆదాయంతో గ్రామాలలో ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉటుంది. కాని కొందరు అధికారులు గ్రామాలకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నప్పటికి ఆ ఆదాయానికి అడ్డంకులు వేస్తున్నారు. ఇలాంటి సంఘటన వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్ల గ్రామంలో వెలుగులోకి వచ్చింది. గొట్టిమక్ల గ్రామ పరిధిలో సుమారు 5 ఎకరాలపై అనంత రీసార్ట్ వెలిసింది. ఈ రీసార్ట్‌లో నిర్మాణ పనులు దాదాపు సంవత్సరం నుండి కొనసాగుతున్నాయి. అందులో విలాసవంతమైన షెడ్స్, కాటేజ్స్, స్విమ్మింగ్‌పూల్ వంటి సదుపాయాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించేలా లగ్జరీగా నిర్మాణం చేశారు. ప్రస్తుతం వీకెడ్స్‌లో బుకింగ్స్ కూడా జరుగుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున నిర్మించిన ఈ రీసార్ట్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ధర్జాగా వ్యాపారం కొనసాగించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసార్ట్ నిర్వహించాలంటే ఖచ్చితంగా డిటిసిపి నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అనంత రీసార్ట్ మాత్రం సరైన అనుమతులు లేకుండానే గత కొన్ని నెలల నుండి ఇల్లీగల్‌గా రీసార్ట్‌ను కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారి చూసి చూడనట్లు వ్యవహరించడం విడ్డూరం. ఇలాంటి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు ఇల్లీగల్‌గా రీసార్ట్ కొనసాగుతున్న విషయం ఓ అధికారికి తెలిసినప్పటికి అతను మౌనం వహించడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. రీసార్ట్ నిర్వహకులు, ఆ అధికారి కుమ్మక్కై గ్రామానికి వచ్చే ఆదాయం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



అనంత రీసార్ట్ బోర్డు

### అక్రమ అనంత రీసార్ట్‌పై చర్యలేవి..?

గత సంవత్సర కాలం నుండి కొనసాగుతున్న ఇల్లీగల్ రీసార్ట్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా లగ్జరీగా నిర్మాణాలు చేసి పర్యటకుల నుండి బుకింగ్స్ తీసుకుంటూ వ్యాపారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. నిబంధనల ప్రకారం డిటిసిపి నుండి ఆ రీసార్ట్‌కు అనుమతులు తీసుకుంటే గ్రామానికి సుమారు 5 నుండి 10 లక్షల పైనే ఆదాయం సమకూరే అవకాశం ఉన్నప్పటికి అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిధులు లేక గ్రామంలో ఎన్నో ఇబ్బందులు పడుతుంటే గ్రామానికి వచ్చే ఆదాయాన్ని కూడా పక్కదారి పట్టించడం ఏంటని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైన డిపిఓ స్పందించి అక్రమ రీసార్ట్‌కు అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అలాగే ఇల్లీగల్‌గా రీసార్ట్‌ను కొనసాగించే నిర్వహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రీసార్ట్‌లో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్ నిర్మాణం


రీసార్ట్‌లో అక్రమ నిర్మాణాలు

## టిపిసిసి అధ్యక్షునికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నర్సారెడ్డి భూపతి రెడ్డి

దుండిగల్ మేజర్ న్యూస్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని నర్సారెడ్డి భూపతి రెడ్డి కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ తో కలిసి మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ప్రజలకు కూడా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



# బ్రాహ్మణపల్లి హనుమాన్ దేవాలయ భూమిని పరిరక్షించాలి

- సర్వే నెంబర్ 215లో 6ఎకరాల 18 గుంటల హనుమాన్ దేవాలయ భూమి అన్యాక్రాంతం కాకుండ పకడ్బంది చర్యలు చేపట్టాలి
- ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన భూమిని అక్రమార్కులు కాజేయాలని చూస్తున్నారు
- నిషేధిత జాబితాలో ఉన్న భూమిని శ్రీనివాసశర్మ అనే వ్యక్తి అక్రమంగా పట్టామార్పిడి చేసుకున్నారు
- సర్వే నెంబర్ 215లోని 6-18 ఎకరాల ఆలయభూమిని హోల్డ్‌లో ఉంచి అన్యాక్రాంతం కాకుండ చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు మాజీ సర్పంచ్, గ్రామస్థుల వినతి






మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 21): మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 215లో ఉన్న 6ఎకరాల 18గుంటల హనుమాన్ దేవాలయ భూమిని అన్యాక్రాంతం కాకుండ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు పులికంటి లక్ష్మయ్య, గ్రామనాయకులు కోరారు. దశాబ్ధాల కాలంగా హనుమాన్ దేవాలయం పేరిట రికార్డుల్లో పొందుపర్చబడి , నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూమిని గత ప్రభుత్వహాయంలో ధరణిలోని లొసుగులను ఆసరా చేసుకొని శ్రీనివాసశర్మ అనే వ్యక్తి అక్రమంగా పట్టామార్పిడి చేసుకుని ఇటీవల రియాల్టర్లకు విక్రయించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాజీ సర్పంచ్, గ్రామస్థులు గ్రామసమీపంలోని సర్వే నెంబర్ 215లో గల 6ఎకరాల 18గుంటల భూమి దేవాలయానికి చెందినదిగా పేర్కొంటూ ఆలయ భూమిలో సూచికబోర్డు ఏర్పాటుచేశారు. అనంతరం తహసీల్ధార్ కార్యాలయానికి చేరుకొని బ్రాహ్మణపల్లి హనుమాన్ దేవాలయానికి చెందిన 6ఎకరాల 18 గుంటల భూమి అన్యాక్రాంతం కాకుండ పకడ్భందీ చర్యలు చేపట్టడంతో పాటు అట్టి భూమిని వెంటనే హోల్డ్‌లో ఉంచాలని మండల తహసీల్ధార్ వినయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పులికంటి లక్ష్మయ్య మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి హనుమాన్ దేవాలయం పేరిట దాదాపు 100 సంవత్సరాల క్రితం నుండి ఉన్న భూమిని ఆనుకొని త్రిబుల్ ఆర్ మార్కింగ్ ఉన్నందున రియాల్టర్ల కన్ను దేయాలయ భూమిపై పడినట్లు వివరించారు. దేవాలయ భూమిని అక్రమంగా పట్టామార్పిడి చేసుకున్న వారిపై కఠిన చర్యలు చేపట్టి గ్రామస్థులందరికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన తహసీల్ధార్‌ను కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ ఉపసర్పంచ్ నారకట్ల వెంకటయ్య, ఏఎంసి డైరెక్టర్ జెల్ల రమేష్‌గౌడ్, గ్రామనాయకులు జెల్ల కొండల్‌గౌడ్, అంజియాదవ్, వెంకటయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

### హైదర్ షాకోట్ మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ కన్నుమూత



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) హైదర్ షాకోట్ మాజీ సర్పంచ్ కడారి లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం ఉదయం ఆమె నివాసంలో కన్నుమూశారు. లక్ష్మమ్మ మరణ వార్త విన్న గ్రామస్తులు కన్నీటి పర్వంతమయ్యారు. లక్ష్మమ్మ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమెకు పలు రాజకీయ నాయకులు గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు.

### పీరం చెరువులో విషాదం చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన అమ్మమ్మ మనవరాలు మృతి



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువు జె ఎన్ ఎన్ యు ఆర్ ఎం క్వార్టర్స్ లో నివాసం ఉండే యూసుఫ్ బి ఆమె మనవరాలు సాబియా , మంగళవారం ఉదయం చెరువులో బట్టలు ఉతుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. వారి మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నార్సింగి కి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 12 : 30 గం. సమయంలో యూసుఫ్ బి వయసు 60 సం. ఆమె మనవరాళ్లు సబియా వయసు 10 సం. ఆయేషా లతో కలిసి బట్టలు ఉతుకోవడానికి పీరం చెరువులోకి వెళ్ళింది. బట్టలు ఉతుకుతున్న సమయంలో యూసుఫ్ బి కాలు జారి చెరువులో పడిపోవడంతో ఆమెని రక్షించడానికి అక్కా చెల్లెలు చెరువులోకి దిగారు. అమ్మమ్మ ను రక్షించే సమయంలో చెల్లెలు కూడా నీళ్లల్లో మునిగిపోవడంతో చుట్టుకొమ్మని పట్టుకొని అతి కష్టం మీద ఆయేషా అరుచుకుంటూ బయటికి రాగా ఆమె అరుపులు విన్న యూసుఫ్ బి అల్లుడు మొహమ్మద్ స్థానికుల సహాయంతో చెరువు లోకి దిగి. ఇద్దరిని బయటికి తీసి చూసిన తర్వాత అమ్మమ్మ మనవరాలు మృతి చెందారని తమకు సమాచారం ఇవ్వడంతో. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

### అవురుపల్లిలో కాంగ్రెస్ నాయకుడికి కన్నీటి వీడ్కోలు

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు గౌని వెంకటయ్యగౌడ్ అంత్యక్రియలకు తరలివచ్చిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 21): మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గౌని వెంకటయ్య (42) ఈనెల 19న హైద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు ఆయన మృతదేహం ఈనెల 20న రాత్రి 9గంటల అనంతరం స్వగ్రామం అవరుపల్లికి చేరుకోగా మంగళవారం మధ్యాహ్నం వెంకటయ్యగౌడ్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌని వెంకటయ్యగౌడ్ చిత్రపటానికి గ్రామంలోని ప్రధాన కూడలిలలో మాజీ సర్పచ్ బాలమోని అలివేలుహరిమోహన్‌గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ బాలమోని వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వెంకటయ్యగౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో అవురుపల్లి మాజీ సర్పంచ్ గౌని నారాయణగౌడ్, మాజీ ఎంపిటిసి గౌని లాలయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు అల్వాల వెంకటయ్యగౌడ్, గౌని సురేష్‌గౌడ్, సొప్పరి రమేష్‌ముదిరాజ్, గౌని ధనుంజయగౌడ్, గౌని శ్రీనివాస్‌గౌడ్, కట్ట మల్లేష్, సొప్పరి శ్రీకాంత్‌ముదిరాజ్, బాలగోని రాజేష్‌గౌడ్, బాలమోని కాటంగౌడ్, బిజెపి బూత్‌కమిటి అధ్యక్షులు గౌని నర్సింహ్మగౌడ్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు రచ్చ చంద్రమౌళి, మెకానిక్ యాదయ్య, గుండాల రమేష్, అల్వాల యాదయ్య, కాన్గుల పర్వతాలు, రవీందర్, వెంకట్‌నారాయణ తదితరులు ఉన్నారు.



### అమర పోలీసుల త్యాగం చిరస్మరణీయం సీఐ జానకిరామ్ రెడ్డి




ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) విధి నిర్వహణలో అసువులు బాసి అమరులైన పోలీసుల త్యాగం చిరస్మరణీయమని ఆమనగల్లు సీఐ జానకిరామ్ రెడ్డి కొనియాడారు. మంగళవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ లో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లులో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో నక్సలైట్ల కాల్పులలో మృతి చెందిన దివంగత ఎస్సై కె .హనుమంత్ రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన వారి త్యాగం ప్రజలలో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాలలో ఎస్సై లు వెంకటేష్, సీతారాం రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నమోదు ప్రక్రియను తనకి చేసిన ఎంపీడీవో కుసుమ మాధురి



ఆమనగల్లు మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి, సీతారాంనగర్ తండాలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నమోదు ప్రక్రియను ఎంపీడీవో కుసుమ మాధురి తనకి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ లో గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, చేపట్టిన ఇంద్రమ్మ ఇండ్ల ఫోటో నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించి లబ్ధిదారుల సమక్షంలో తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపులో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి ప్రభుత్వ సంస్థకి, ఇండ్లలో ఇంకుడు గుంతలు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్, మ్యాజిక్స్ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల కు సూచించారు. వాటి అంచనాలు వేసి పనులు ప్రారంభించాలని, నర్సరీలు,పల్లె ప్రకృతి వనాలు కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్స్ జైపాల్, ఈదమయ్య, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడి... చికిత్స పొందుతూ వ్యక్తి మృతి




ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) ఆమనగల్లు పట్టణానికి చెందిన కొమ్ము వెంకటయ్య (47) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు ఈ నెల 16 న మాడుగుల మండలంలోని నల్లచెరువు గ్రామంలో తమ సమీప బంధువుల శుభకార్యానికి వెళ్లి బైక్ పై తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య పద్మ ముగ్గురు కుమారులు ప్రవీణ్, ప్రదీప్, నవీన్ ఉన్నారు. మృతుని మృతదేహంపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వస్పుల జంగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దోమ మండలంకు మరో బ్రాంచ్ ఏర్పాటు చేయండి

- ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ నితిన్‌ను కోరిన దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి

**దోమ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21):**
ఖాతా దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దోమ మండలంకు అదనపు ఎస్బీఐ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయాలనీ ఎస్బి ఐ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ నితిన్‌ని దోమ మండల సర్పంచ్‌ల సంగం మాజీ అధ్యక్షులు కె. రాజిరెడ్డి కోరారు.మంగళవారం దోమ ఎస్‌బీఐ బ్యాంకు సందర్శనకు వచ్చిన రీజినల్ మేనేజర్‌తో మాజీ సర్పంచ్ కె రాజిరెడ్డి కాసేపు మాట్లాడారు బ్యాంకులో ఉన్న ఖాతా దారుల ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిపారు. దోమ మండలంకు ఒకటే ఎస్‌బీఐ బ్రాంచ్ ఉండడం తో సర్వీస్ ఏరియా ఖాతా దారులు లావాదేవీల కోసం



రోజంతా వేచి చూసే రోజులు ఉన్నాయని ఈకెవైసీ ఆధార్ అప్డేట్ మొబైల్ లింక్ ఖాతాల పునరుద్ధరణ ఖాతాల ప్రారంభం వంటి చిన్న చిన్న పనులకు కూడా నెలల కొద్దీ సమయం తీసుకుంటున్నారు. అలాగే దోమ మండలంలో దాదాపు ఇరవై వేల మంది రైతుల ఖాతా దారులు ఉండడంతో వ్యవసాయ రుణాలకు కమర్షియల్. ప్రభుత్వ. విధార్థులు. ఇతర సేవింగ్స్ ఖాతాదారులు దాదాపు యాభై వేల వరకు ఉండొచ్చు అని రాజిరెడ్డి తెలిపి ఇక్కడ స్టాఫ్ కూడా సరిపడ లేదని మండలంలో ఎక్కడైనా సరే ఒక అదనపు బ్రాంచ్ ఇవ్వాలని కోరగా రీజినల్ మేనేజర్ నితిన్ మాట్లాడుతూ ముప్పై వేల లోపు విడ్రాలు సీస్‌పిల ద్వారా చెల్లింపులు ఉంటాయని దోమ మండలం లో పన్నెండు సీఎస్‌పిలు ఉన్నాయని చెపుతు ఖాతా దారులకు మెరుగైన సేవలు అందిస్తామని నూతన బ్రాంచ్ కూడా ఇక్కడ జరిగే లావాదేవీలను బట్టి నిర్ణయం ఉంటుంది అని ఖాతా దారులుకు సిఎస్‌పిలు అందిస్తున్న సేవల గురుంచి స్థానిక మేనేజర్ ను అడిగి తెలుసుకొని వారికీ సమావేశం చిన్న చిన్న పనులు చేయించాలని రీజినల్ మేనేజర్ నితిన్ కోరారు.

# పదవ తరగతి విద్యార్థులకు అభ్యాస దీపికల సరఫరా

**దోమ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :**
దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దోమ పాఠశాలకు సంబంధించి 10వ తరగతి విద్యార్థులకు మార్చిలో నిర్వహింపబడే పదవ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించడం కోసం ప్రభుత్వం అభ్యాస దీక్షలను అందజేయడం జరిగింది. జీవ శాస్త్రము భౌతిక శాస్త్రము సాంఘిక శాస్త్రము గణిత శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి పరీక్షల్లో రాబోయే ముఖ్యమైన ప్రశ్నలతో నిపుణులచే రూపొందించబడిన అభ్యాస దీపికలను అందచే యడం జరిగింది. తెలుగు మీడియం విద్యార్థులు 30 మంది ఆంగ్ల మాధ్యమం విద్యార్థులు 45 మంది కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు గౌడ్ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు.



విద్యార్థులు ఇప్పటినుంచి క్రమం తప్పకుండా చదివి మంచి ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాం. అభ్యాస దీపికలు అందజేసినందుకు డీఈవో రేణుకాదేవి కి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ సహాయాన్ని అందుకొని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి అమావాస్య రోజున మానవతా సేద్యం

## మేడ్చల్‌లో శ్రీపాద వల్లభ ట్రస్టు అన్నదాన కార్యక్రమం

**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21):**
మేడ్చల్ పట్టణంలోని ఏడు గుడుల అమ్మవారి ఆలయం వద్ద ప్రతి అమావాస్య రోజున శ్రీపాద వల్లభ ట్రస్టు ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం భక్తి పూర్వకంగా జరుగుతోంది. ఈ సందర్భంగా దాదాపు 500 మందికి పైగా నిరుపేదులు, అనాధులు, మతిస్థిమితం లేని వారు కడుపునిండా అన్నం తిని సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీపాద వల్లభ ట్రస్టు చైర్మన్ తాళ్లపల్లి రమేష్ గుప్తా మాట్లాడుతూ, శ్రీపాద వల్లభ దాతల సహకారంతో పట్టణంలో ఆకలితో ఉన్నవారికి ఒక పూట కడుపునిండా అన్నం పెట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అన్న తాత్వికతతో ఈ సేవా



కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు.

అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులు మాట్లాడుతూ, మాకు అన్నం పెట్టినవారే నిజమైన దాతలు. ప్రతి నెలా ఇలాంటి సేవా కార్యక్రమం జరిగితే ఎవరూ ఆకలితో ఉండరని పేర్కొన్నారు. భక్తులు ట్రస్టు సభ్యుల సేవా తపనను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నరేంద్ర చారి, జంలాల్ నాయక్, నరసింహులు పటేల్, సంతోష్ గుప్తా, నవీన్ గుప్తా, కుమ్మరి జహంగీర్, శంకర్ పటేల్, మల్లికార్జున పటేల్, సుధాకర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దర్గాను యథాస్థానంలో ఏర్పాటు చేయాలి

**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 21):**
కొడంగల్‌లో రోడ్డు విస్తరణలో ఇటీవలే పోలీస్‌స్టేషన్ సమీపంలో గల మహిబూబ్ సుభానీ దర్గాను తొలగించిన స్థానంలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు, వికారాబాద్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఎస్బీ.గుల్షన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తొలగించిన దర్గా విషయంలో ఇటీవలే హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలవగా అదే స్థానంలో ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి 20 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే దర్గా నిర్మాణానికి చర్యలు తీసుకోని పక్షంలో ఈ నెల 24న రిలే నిరాహార దీక్ష చేస్తామన్నారు. సమావేశంలో షేక్ రుమాన్, ఎండీ.సర్తాజ్ హుసేన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.ముర్తజా, ఎండీ.ఆమేర్ హుసేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్బీ.గుల్షన్

# జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థి



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :**
రాష్ట్ర స్థాయిలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ క్రీడలలో ముజాహిద్ పూర్ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి అభిరామ్ జాతీయ స్థాయిలో ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న క్రీడలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా,వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

# అంత్యక్రియ కార్తిక సహాయం అందజేత..



ఆర్థిక సహాయం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గౌడ్

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21):**
కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గేటు సమీపంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎముకంటి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గుర్రంపల్లి నర్సింలు గౌడ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.3వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలని ఆదుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, వెంకటయ్య, జంగం మల్లయ్య, షాబాద్ శ్రీను, జంగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్యులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

- కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు




పశు వైద్యాధికారితో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)**
అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ఉన్న పశువులకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని, పశువులకు వ్యాధులు ప్రబలకుండా పాడి రైతులకు పశువైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం పరిగి నియోజకవర్గం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామంలోని పశు వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యురాలు హాతిరాం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొయిని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దరఖాస్తులు గడువు పొడిగింపు

▶▶ ఈనెల 23 వరకు స్వీకరించనున్న దరఖాస్తులు ▶▶ ఇప్పటి వరకు 15,710 దరఖాస్తులు ▶▶ అక్టోబర్ 27న మల్లికా గార్డన్‌లో లక్కీ డ్రా



రంగారెడ్డి, మేజర్ న్యూస్ (ఆక్టోబర్ 21) : తెలంగాణలో కొత్త మద్యం దుకాణాల లైసెన్స్‌ల దరఖాస్తుల గడువును అక్టోబర్ 23 వరకు పొడిగించారు. బ్యాంకులు పనిచేయకపోవడంతో డీడీలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదురు కాగా.. వ్యాపారుల వినతులను ప్రభుత్వం పరిగణంలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో లక్కీ డ్రా అక్టోబర్ 27కి వాయిదా పడింది.

బీసీ బంద్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించింది. ఈనెల 27న శంషాబాద్‌లోని మల్లిక గార్డన్‌లో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. గత నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదట మందకొడిగా దరకాస్తులు రాగా చివరి నాలుగు రోజులుగా ఊపందుకున్నాయి. రంగారెడ్డి జిల్లాలో సరూర్‌నగర్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్‌లు ఉండగా మొత్తం మొత్తం 249 మద్యం షాపులు ఉన్నాయి. శంషాబాద్ పరిధిలో 111 మద్యం షాపులు, సరూర్‌నగర్ పరిధిలో 138 మద్యం షాపులున్నాయి. గత నెల 26వ తేది నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 249 మద్యం షాపులకు 15,710 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సరూర్‌నగర్ సూపరిండెంట్ పరిధిలో 7,595 దరఖాస్తులు రాగా శంషాబాద్ సూపరిండెట్ పరిధిలో 8,110 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం శంషాబాద్ పరిధిలో మరో ఐదు దరఖాస్తులు వచ్చాయి.

**లక్కీ డ్రాకు ఏర్పాట్లు..**

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ఈనెల 23 వరకు పెంచిన నేపథ్యంలో ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు శంషాబాద్‌లోని మల్లిక గార్డన్‌లో లక్కీ డ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు దారులు ఉదయం 9 గంటలకు గార్డన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన రశీదును తీసుకురావాల్సి ఉంటుంది. దరఖాస్తు దారు లేని పక్షంలో అథరైజేషన్ లెటర్ ఉన్న వ్యక్తులను అనుమతిస్తారు. ఇందుకు సంబంధించిన ఎంట్రీ పాసులను అందజేయనున్నారు.

# పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ని కలిసిన రాచమల్ల సురేష్



శంషాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) : హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సజ్జనార్ సర్ ని కాంగ్రెస్ సీనియర్ నాయకలు ఎస్వీజీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాచమల్ల సురేశ్ కుమార్, వినయ్ కుమార్, మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసి, చెడుపై మంచి గెలుపుకు ప్రతీకగా సజ్జనార్ సార్ నిలిచారన్నారు. గతంలో దిశ సంఘటనను ఈసందర్భంగా గుర్తు చేశారు. సజ్జనార్ సార్ సేవలు మన సమాజానికి ఎంతో అవసరం భవిష్యత్తులో కూడా మరిన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కొనియాడారు.










## పత్తి కొనుగోలు కేంద్రాలను ఎర్పాటు చేసిన సీసీఐ

యాచారం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21): సీ సీ ఐ కొనుగోలు కేంద్రాల పత్తి మిల్లులను నోటిఫై చేసినట్లు యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. పత్తి కి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాల్ కి రూ. 8110 /- నిర్ణయించినట్లు, పత్తి లో తేమ 8 శాతం లోపు ఉన్నప్పుడే కనీస మద్దతు ధర దక్కుతుందని, తేమ శాతం పెరిగినచో కనీస మద్దతు ధర తగ్గుతుందన్నారు. పత్తి లో తేమ 12 శాతం కంటే ఎక్కువ ఉన్నట్లయితే సీ సీ ఐ పత్తిని కొనుగోలు చేయదని తెలిపారు.

రైతులు తమ పత్తిని తేమశాతం తక్కువగా ఉండేలా ఆరబెట్టి, చెత్త లేకుండా శుద్ధి చేసి అమ్ముకోవాలని సూచించారు. పత్తిని స్లాట్ బుకింగ్ పద్ధతిలో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని, అందుకోసం ముందుగా %ఖుఖుజుూఖం ఖఅయిఖఅ ఎశీఎఅశ్రీవ ఖజూజూ% మొబైల్ ఫోన్లో %ూశ్రీఖఎ హ్‌శీతీవ% నుండి డౌన్లోడ్ చేసుకొని, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకోవడం ఇబ్బంది అనిపిస్తే మార్కెట్ కమిటీ కార్యాలయంలో,గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదిస్తే స్లాట్ బుకింగ్ చేస్తారని తెలిపారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలు వివరాలు ఇలా ఉన్నాయి, తిరుమల ట్రేడింగ్ కంపెనీ, నందిగామ,
హరిహర జిన్నింగ్ %డ% ప్రెస్సింగ్ ప్రైవేట్ లిమిటెడ్, నందిగామ, తుల్జా భవాని కాటేక్స్, నందిగామ,
ఎన్డిటి కాటన్ ఇండస్ట్రీస్ కేరఫ్ కిసాన్ జిల్లింగ్ %డ% ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ ఆకుతోటపల్లి గ్రామం, అమన్ గల్ మండలం,శ్రీ అభిషేక కాటన్ మిల్స్ పోలేపల్లి గ్రామం, అమంగల్ మండలం,శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్ తలకొండపల్లి గ్రామం, మండలం. సులభంగా పత్తి అమ్మడానికి పూర్తి సమాచారం కోసం సెల్ నెంబర్ 8897281111 నుంచి వాట్సాప్ చేస్తే సమాచారం అందుతుందని తెలిపారు.






## అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

# ఘనంగా దీపావళి వేడుకలు...

● హాజరైన సంస్థ డైరెక్టర్ నవీన్ కుమార్....







దీపావళి వేడుకల్లో పాల్గొన్న అంకిత సంస్థ ప్రతినిధులు.

కార్యాలయం ముందు టపాసులు కలుస్తున్న సిబ్బంది.

**పరిగి. మేజర్ న్యూస్ (అక్టోబర్ 21)**

అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ జిల్లా కార్యాలయంలో సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో పువ్వులతో ముగ్గు, హ్యాపీ దీపావళి పేరుతో చేసిన అలంకరణ బాగా ఆకట్టుకుంది. దీపావళి వేడుకలకు సంస్థ డైరెక్టర్ నవీన్ కుమార్ హాజరైయ్యారు. సిబ్బందితో కలిసి పటాసులు కాల్చి దీపావళి వేడు కలు జరుపుకున్నారు. అనంతరం సిబ్బందికి దీపావళి గిఫ్టలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ వికారాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ సీ ఎఫ్ అనంత్, జన్ సాతిలు నర్సింలు, వెంకయ్య, సంజీవ రావు, సాయి తేజ, విజయలక్ష్మి, అర్చన, హెల్ప్ లైన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తూముకుంటలో ఘనంగా సదర్ ఉత్సవాలు

### దున్నపోతుల విన్యాసాలతో యాదవులు ఆకట్టుకున్నారు



**శామీర్ పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21) :**

తూముకుంట మున్సిపాలిటీలో సదర్ ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. సంప్రదాయ పద్ధతిలో, ఉత్సాహభరిత వాతావరణంలో యాదవులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతిని ప్రతిబింబించే ఈ వేడుకతో పట్టణం పండుగ మూడ్‌లో మునిగిపోయింది. ఈ కార్యక్రమానికి తూముకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ ముఖ్య అతిథిగా హాజరై సదర్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వాటితో పట్టణంలో అద్భుతమైన ర్యాలీ నిర్వహించారు.

అందంగా అలంకరించిన దున్నపోతులతో యాదవులు ప్రదర్శించిన విన్యాసాలు ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. డప్పుల మ్రోగులు, నృత్యాలు, శంఖనాదాలు, హర్షధ్వానాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం



**కొడంగల్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 21):**

హరే రామ, హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు పౌండేషన్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నట్లు డిప్యూటీ మేనేజర్ కృష్ణ చైతన్య తెలిపారు. అల్పాహారం పథకంలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు సెట్ దోశను అందించారు.

పాఠశాలలోని 700 మంది విద్యార్థినులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇడ్లీ, మిల్లెట్, ఉప్మా, పొంగలి, బొండా, పూరితో పాటు సెట్ దోశను కూడా అందిస్తామని ఆయన తెలిపారు.

## నవీన్ యాదవ్‌కి మద్దతుగా షేక్ పేట ఎంఐఎం సమావేశం

### -షేక్ పేట మారుతి నగర్ కాలనీ ప్రైమరీ యూనిట్ అధ్యక్షులు బోయమాన వంశీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహణ

జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్:

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి మద్దతు ప్రకటించడంతో జూబ్లీహిల్స్ ఎంఐఎం శ్రేణులు నవీన్ యాదవ్‌కి మద్దతుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముందుగా షేక్ పేట మారుతి నగర్ కాలనీ ప్రైమరీ యూనిట్ అధ్యక్షులు బోయమాన వంశీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా షేక్ పేట కార్పొరేటర్ మహమద్ రషీద్ ఫరజుద్దీన్, షేక్ పేట ఇంచార్జ్ రహమతుల్లా తయ్యబ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మొదలగు నాయకులు కార్యకర్తలకు ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. నవీన్ యాదవ్‌కి ఎందుకు ఓటు వెయ్యాలి? నవీన్ యాదవ్ వలన ఉపయోగం ఏంటి నవీన్ యాదవ్ ఎలాంటి పని చేస్తారు అన్న విషయాలు ప్రజలకు తెలియజేశారు. సేవ గుణం కలిగి విద్యావంతులు అయినా నవీన్ యాదవ్ శాసనసభ్యులు అయితే సమస్యలు పరిష్కరించి, బస్తీలు అభివృద్ధి జరుగుతాయని, యువతకు ఉద్యోగం, మహిళలకు అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళ్తారని, నవీన్ యాదవ్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## యంనంపేటలో పశువులకు

# ఎఫ్ఎండి టీకాలు



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :**
పశువులకు అంటువ్యాధులు సోకకుండా పాదం-నోటి వ్యాధి (ఎఫ్ఎండి) టీకా తప్పనిసరిగా వేయాలని మండల పశువైద్యాధికారి పద్మిని సూచించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట గ్రామంలో మంగళవారం దాదాపు 160 ఆవులు, పాడిగేదలకు ఎఫ్ఎండి టీకాలు వేశారు. ఈ సందర్భంగా పద్మిని మాట్లాడుతూ...పాడి రైతులు తమ పశువులను అంటువ్యాధుల నుండి రక్షించుకోవడానికి నిర్దిష్ట వ్యవధిలో టీకాలు వేయించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎఫ్ఎండి టీకా వలన పశువుల్లో వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :** పోలీసు సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని హెల్మెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మల్కాజ్గిరి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ యస్. చక్రపాణి, ఇన్స్పెక్టర్ బి. రాజుతో కలిసి గస్తీ విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో తాము రక్షణ చర్యలు పాటించడం అత్యవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగతనం కేసును చేదించిన పోలీసులు

● నేరస్తున్ని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**ధారూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21):**
దొంగతనం కేసులో ఓ నేరస్తున్ని రిమాండ్‌కి తరించినట్లు ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన రుమ్మా యాదగిరి వికారాబాద్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తాడు. ఆదివారం వికారాబాద్ నుండి అల్లాపూర్ గ్రామానికి వచ్చేసరికి తన ఇంటి తాళం విరగొట్టి బీరువాలో ఉన్న నగదు దొంగలించబడటంతో యాదగిరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన si రాఘవేందర్, అదే గ్రామానికి చెందిన అంతరం అనిల్‌ఏ కుమార్ అను వ్యక్తి పైన అనుమానం రావడంతో పోలీస్‌ల విచారణానంతరం తానే దొంగతనం చేసినట్లుగా అనిల్ ఒప్పుకున్నడు. అయితే గతంలో బొమ్రాస్పేట్ పోలీస్ స్టేషన్ నందు అనిల్ పైన కేసులు ఉన్నట్లుగా విచారణలో తేలిందని,అనిల్ ను రిమాండ్‌కి తరలించినట్లుగా ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.

# బీసీలకు చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రమళ్ళ మొగిలన్న**



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(అక్టోబర్, 21):** బీసీలకు చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రమల్ల మొగిలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ...

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీని ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతునిచ్చాయని పేర్కొన్నారు.

రిజర్వేషన్ అమలు విషయంలో ఇటు రాష్ట్రప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వాలు డ్రామాలాడుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే అన్నట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిల్లుకు ఆమోదం తెలపకుండా బీసీలను మోసం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డ్రామాలాడుతున్నాయన్నారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాలంటే తెలంగాణలో ఉన్న 8 మంది ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామా చేస్తే ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో బిల్లు పెట్టడానికి అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకపోయి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం దారణమన్నారు. ఎస్సీలు, బీసీలు రాజకీయంగా ఎదగాలంటే జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు . కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని మొగిలన్న హెచ్చరించారు.

# జిల్లాలోని అల్వాల్ ఐటీఐలో జాబ్ మేళా

- **ఈ నెల 23న, అర్హత గల యువతీ**
- **యువకులకు అవకాశం : యం.రాధిక**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21):** మేడ్చల్ జిల్లా నిరుద్యోగ యువతీ–యువకుల కోసం ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మేళా అల్వాల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, సిద్ధిపేట రోడ్, గణేష్ ఆలయం సమీపంలోని లోతుకుంటలో జరగనుందని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యం. రాధిక ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఎస్‌వీసీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ మేళాలో పాల్గొననుంది. పికర్, ప్యాకర్, అసోసియేట్, పుట్అవే, సెగ్రిగేటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. అర్హతల పరంగా ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయో పరిమితి 19 నుండి 34 సంవత్సరాల మధ్యగా నిర్ణయించారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 నుండి రూ.20,000 వరకు వేతనం అందజేయనున్నారు. పని ప్రదేశాలు కొంపల్లి, కండ్లకోయ, మేడ్చల్ ప్రాంతాల్లో ఉంటాయి. ఉద్యోగార్థులు తప్పనిసరిగా తమ ఉపాధి కార్డు పొందాలి. దానికోసం తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్ www.employment.telangana. gov.inలో జాబ్ సీకర్ ఎంపిక ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

మరిన్ని వివరాల కోసం 8297291356, 7893894857, 9866465024, 7386809422 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి యం. రాధిక మాట్లాడుతూ, "జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ జాబ్ మేళా మంచి అవకాశం. ప్రైవేట్ రంగంలో తక్షణ నియామకాలు జరుగుతాయి. అర్హత గల యువతీ, యువకులు తప్పక హాజరుకావాలి" అని సూచించారు.

# జాతీయ రహదారిపై మినీ బస్సు బీభత్సం

- **మూడు వాహనాలను ఢీకొట్టిన బస్సు**
- **అక్కడికక్కడే ఒకరు మృతి**






మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్, 21): ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి నంబర్ 44పై మినీ ప్రైవేట్ బస్సు బీభత్సం సృష్టించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంపేట ఎక్స్‌రోడ్ వద్ద మేడ్చల్ నుండి డబీల్‌పూర్ వైపు వెళ్తున్న మినీ బస్సు (నంబర్ AP28 TA 6454) బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి అవతలి రహదారిలోకి దూసుకెళ్లింది. బస్సు వరుసగా మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి, అనంతరం రోడ్డుపక్కన ఉన్న భవనాన్ని ఢీకొట్టి ఆగింది. ప్రమాదం జరిగిన సమయం సుమారు ఉదయం 7:30 ప్రాంతం. రహదారిపై వాహనాల రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఈ ప్రమాదంలో డబీల్‌పూర్ నుండి మేడ్చల్ వైపు వస్తున్న బుల్లెట్ బైక్ (TS17 K 5738) పై ప్రయాణిస్తున్న మాలోత్ శ్రీనివాస్ (బంజేపల్లి, కామారెడ్డి జిల్లా) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడి చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా దీపావళి పండుగ వేడుకలు



**చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 21):** దీపావళి పండుగను పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం ప్రజలు దీపావళి పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా బాణసంచాలు కాల్చుతూ సంబరాల్లో మునిగితేలారు. వ్యాపారులు సైతం దుకాణాలకు మామిడి తోరణాలు, రంగు రంగు పూలతోరణాలతో అందంగా ముస్తాబుచేశారు. సాయంత్రం వేళల్లో వ్యాపారులు, ప్రజలు, భక్తులు లక్ష్మిదేవతకు ప్రత్యేక పూజలు చేశారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎడ్ల సురేష్...

- **తాండూరు నుండి భారీగా తరలి వెళ్లిన మాల మహానాడు ప్రతినిధులు**



**బషీరాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21):** బషీరాబాద్ మండలం నవాల్గీ గ్రామానికి చెందిన మాల ఎడ్ల సురేష్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మంగళవారం నాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఎడ్ల సురేష్, మాల మహానాడు ప్రతినిధుల బృందం సభ్యులు మాట్లాడుతూ.... తొలిసారిగా మాల మహానాడు బలపరిచిన అభ్యర్థిగా ఎడ్ల సురేష్ స్వాతంత్ర అభ్యర్థిగా ఎడ్ల సురేష్ బరిలో ఉంటున్నాడని చెప్పారు. ఇక నుంచి ప్రత్యక్ష ఎన్నికలలో మాల మహానాడు అభ్యర్థులు పోటీలో ఉంటారని చెప్పారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో మాల మానాడు అభ్యర్థిగా గణ విజయం సాధించి చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. డాక్టర్ బాబాసాహెబ్ ఇచ్చిన రాజ్యాధికారంతో అట్టడుగు వర్గాలు చట్టసభల్లోకి అడుగు పెట్టడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. ప్రజల అండతో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించడం కోసం ఇందాకైనా వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధుల బృందం సభ్యులు, తదితరులు ఉన్నారు.



## సిటిజన్ సర్వేకు విశేష స్పందన

- ఈనెల 25న ముగియనున్న సర్వే
- సర్వేలో ప్రతి పౌరుడు పాల్గొనాలి
- విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 21) :** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూప కల్పనకు ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల నుంచి పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందించినట్లు చెప్పారు. మన దేశానికి స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలనే దానిపై ప్రజల నుంచి తగు సలహాలు, సూచనలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించిన ఈ సర్వేను ఈనెల 25వ తేదితో ముగియనుందని చెప్పారు. ఈ సర్వేలో ప్రతి పౌరుడు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు www.telangana.gov.in/telanganarising వెబ్‌సైట్ ద్వారా తెలపాలని ఆయన కోరారు.